# సాక్షి చిత్తూరు

శుక్రవారం । 28 । మార్చి । 2025






## ఏమిటీ మాయ!

గతంలో ప్రారంభించిన పూలే భవన శిలా ఫలకం కూల్చి, మళ్లీ ప్రారంభిస్తున్న సంఘటన చిత్తూరులో జరగనుంది. - II లో



## జనసేన నేతపై సారా కేసు

పొలంలో సారా తయారీకి నల్లబెల్లం ఊటను సిద్ధం చేసిన జనసేన నాయకుడిపై కేసు నమోదు అయ్యింది. - II లో

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ శుక్రవారం (సా) | సహర్ శనివారం (ఉ) |
|---|---|---|
| చిత్తూరు | 6-29 | 4-51 |
| పుంగనూరు | 6-31 | 4-54 |

## న్యూస్‌రీల్

### బోయకొండ హుండీ ఆదాయం రూ.36.18 లక్షలు



బోయకొండలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

**చౌడేపల్లె:** బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం నిర్వహించిన హుండీ కానుకలు లెక్కింపు ద్వారా రూ.36.18 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూ.36,18,670, బంగారం 15 గ్రాములు, వెండి 420 గ్రాములు వచ్చిందని పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ 2 నోట్లు లభించినట్లు తెలిపారు. ఈ ఆదాయం 31 రోజులకు వచ్చినట్లు ఈఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఇండియన్ ఆర్మీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇండియన్ ఆర్మీ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారన్నారు. గుంటూరు లోని ఇండియన్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 10వ తేదీ లోపు www.ojinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ కోరారు.

### రిజిస్ట్రార్ కార్యాలయాలకు సెలవు రద్దు

**చిత్తూరు కార్పొరేషన్:** ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సెలవులు రద్దు చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాలకు పని దినాలుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వును జారీ చేసింది. ఆదివారం ఉగాది పండుగ, సోమవారం రంజాన్ పండుగలున్నాయి. కానీ ఆ రోజుల్లో కూడా ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ కార్యాలయాలు పనిచేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### నేడు ఉపకరణాల పంపిణీ



ఏపీసీ వెంకటరమణ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో అర్హులైన విభిన్నప్రతిభావంతులకు ఈ నెల 28వ తేదీన సహాయ ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఎంపిక చేసిన 301 మంది విభిన్నప్రతిభావంతులకు ఉపకరణాలు అందించనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని పూలే భవనంలో నిర్వహించే కార్యక్రమంలో ఉపకరణాల పంపిణీ జరుగుతుందన్నారు. రూ.29.24 లక్షల విలువ చేసే బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ సైకిళ్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్‌లు, రొటేటర్ చైర్లు, రోలర్స్, టీఎల్‌ఎం కిట్స్‌ను అందజేయడం జరుగుతుందని ఏపీసీ వెల్లడించారు.

సీఎం సొంత నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం ఎంపీపీ ఉప ఎన్నిక టీడీపీ నేతల దౌర్జన్యాలు, అరాచకాలకు పరాకాష్టగా నిలిచింది. అధికారుల తీరు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని తెచ్చింది. పోలీసుల ప్రేక్షకపాత్ర విస్మయానికి గురిచేసింది. కోరం లేకపోయినా ఆరుగురు ఎంపీటీసీసభ్యులతోనే ఎంపీపీ ఉప ఎన్నిక పూర్తిచేయడం విమర్శలకు తావిచ్చింది. ఇక తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని మూడు ఎంపీపీ స్థానాలతో పాటు, ఒక వైస్ ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ తిరిగి కైవశం చేసుకుంది.

రామకుప్పం: వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను అడ్డుకుంటున్న టీడీపీ నేతలను వారిస్తున్న పోలీసులు



రామకుప్పంలో పోలీసు బందోబస్తు నడుమ ఎంపీటీసీల తరలింపు



# అరాచక పర్వం!

## ఎంపీపీ ఎన్నికల్లో కూటమి నేతల దౌర్జన్యాలు

- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను రానీయకుండా అడ్డంకులు
- పట్టనట్టు వ్యవహరించిన పోలీసులు
- రామకుప్పంలో పేట్రేగిపోయిన టీడీపీ మూకలు
- తిరుపతి రూరల్, సదుం, తవణంపల్లి ఎంపీపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవం



తవణంపల్లె ఎంపీపీ ప్రతాపరెడ్డిని సత్కరిస్తున్న పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్

**సాక్షి ప్రతినిధి, తిరుపతి:** తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో గురువారం జరిగిన నాలుగు మండల పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నికల్లో మూడింటిని వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంది. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం పరిధిలోని రామకుప్పం ఎంపీపీ స్థానాన్ని టీడీపీ అడ్డదారిలో దక్కించుకుంది.

**అరాచకాలకు దిగుతూ.. అడ్డంకులు సృష్టిస్తూ**

సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం పరిధిలోని రామకుప్పం మండల ఎంపీపీ స్థానాన్ని దక్కించుకునేందుకు టీడీపీ నేతలు దౌర్జన్యకాండకు దిగారు. ఇక్కడున్న 16 ఎంపీటీసీ స్థానాలను గతంలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసింది. ఎంపీపీగా ఉన్న శాంతకుమారి మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్‌సీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి లాక్కుంది. ఒక ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించలేదు. మిగిలిన ఎనిమిది మంది ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారు. వీరిని వెంటబెట్టుకుని ఎమ్మెల్సీ భరత్‌కృష్ణ ప్రత్యేక వాహనంలో మండల పరిషత్ కార్యాలయానికి బయలు దేరారు. గురువారం ఉదయం 9.50 గంటలకు వీ కోట పరిధిలోని కొత్తూరులోని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నివాసం నుంచి పోలీసు బందోబస్తు మధ్య బయలు దేరారు. మార్గమధ్యంలో ఎంపీటీసీల వాహనాన్ని టీడీపీ మూకలు పథకం ప్రకారం పత్రపల్లి క్రాస్, అన్నవరం క్రాస్, రాజుపేట క్రాస్‌లో అడ్డుకున్నారు. ఎంపీటీసీల వాహనానికి ముందు, వెనుక కార్లు, ట్రాక్టర్లు, టెంపో వాహనాలను అడ్డుపెట్టి ముందుకు కదలకుండా చేశారు. మరి కొన్నిచోట్ల చెట్లను నరికి రోడ్డుకు అడ్డుగా వేశారు. అడ్డుగా ఉన్న వాహనాలు, చెట్లను తొలగించుకుంటూ రామకుప్పం మండల పరిషత్ కార్యాలయం చేరే సరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. కేవలం 15 కి.మీ దూరంలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకోవడానికి మూడు గంటల పైగా సమయం పట్టింది. ఆలోపు టీడీపీ ఆరుగురు ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీ ఎన్నికను పూర్తి చేయించుకుంది. చివరకు టీడీపీ బలపరిచిన రామకుప్పం ఎంపీపీగా సులోచన(ఉనిసిగనిపల్లె), వైస్ ఎంపీపీగా వెంకట్రామగౌడ్(విజలాపురం)ను ఎన్నుకున్నారు. టీడీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, రామకుప్పం మండల పరిషత్ ఉప ఎన్నికపై ఎన్నికల కమిషన్‌కు విన్నవిస్తామని, అలాగే సుప్రీం కోర్టుకు కూడా వెళ్తామని ఎమ్మెల్సీ భరత్‌కృష్ణ స్పష్టం చేశారు.



తిరుపతి రూరల్ మండలం ఎంపీపీగా ఎన్నికైన మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు మాదవరెడ్డి, యశోదలను సత్కరిస్తున్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

## వైఎస్సార్‌సీపీ హవా



మాధవి, సదుం

తిరుపతి రూరల్, సదుం, తవణంపల్లె మండల పరిషత్ అధ్యక్షులుగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రామకుప్పం మినహా మిగిలిన స్థానాల్లో వైఎస్సార్‌సీపీ బలపచిన అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సదుం మండల పరిధిలో పది మంది ఎంపీటీసీలు ఉన్నారు. అయితే ఇందులో ఇద్దరు మరణించగా మిగిలిన ఎనిమిది మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసిన మాధవి(పాలమంద)ని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని తవణంపల్లి ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంది. ఇక్కడ 15 ఎంపీటీసీ స్థానాల్లో కేవలం ఒకే ఒక్క స్థానంలో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. ఉప ఎన్నికలో 14 మంది ఎంపీటీసీలు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరచిని ప్రతాప్‌సుందర్ రాయల్‌రెడ్డి (మల్లకుంట)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- విజయపురం మండల ఉపాధ్యక్షురాలిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన కన్నెమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- పెనుమూరు కో-ఆప్షన్ సభ్యురాలిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన నసీమానుఎన్నుకున్నారు.
- చంద్రగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాజీనామాతో తిరుపతి రూరల్ ఎంపీపీ ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 40 ఎంపీటీసీ స్థానాలు ఉంటే 39కి ఎన్నికలు జరిగాయి. అందులో 38 వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలుపొందారు. కేవలం ఒక స్థానంలోనే టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాజీనామాతో గురువారం ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఉప ఎన్నిక సజావుగా నిర్వహించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాస్థానం ఆదేశాల మేరకు పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చారు. సీసీ కెమెరాల నిఘాలో ఉపఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో 33 మంది ఎంపీటీసీలు పాల్గొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మూలం చంద్రమోహన్‌రెడ్డి(పేరూరు-1 సెగ్మెంట్)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రూ.307.60 కోట్లతో చిత్తూరు మున్సిపల్ బడ్జెట్

**చిత్తూరు అర్బన్:** మున్సిపల్ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.307.60 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను రూపొందించారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అముద అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఈ అంచనాలను పాలకవర్గం ఆమోదిస్తూ తీర్మానించింది. ఈ ఏడాది ప్రారంభ నిల్వ రూ.30.54 కోట్లుగా చూపించిన అధికారులు.. మూల ధనం, ఆదాయం ద్వారా రూ.277.06 కోట్లు ఖజానాకు రావచ్చని, ప్రారంభ నిల్వతో కలిపి రూ.307.60 అంచనాతో బడ్జెట్ తయారు చేశారు. ఇందులో రూ.275.62 కోట్లు వ్యయంగా చూపించారు. మొత్తం బడ్జెట్ రూ.307.60 కోట్లలో ఖర్చులు పోను, రూ.31.97 కోట్ల మిగులు నిధుల బడ్జెట్‌ను అంచనాలుగా రూపొందించారు. సాధారణ నిధులకు సంబంధించి కార్పొరేషన్ సేవలు, నిర్వహణ వ్యయాలు పోను అభివృద్ధి పనులకు నికరంగా రూ.23.89 కోట్లు కేటాయించారు. ఇందులో షెడ్యూల్ కులాల నివాస ప్రాంతాల అభివృద్ధికి రూ.3.54 కోట్లు, షెడ్యూల్ తెగలకు రూ.1.79 కోట్లు, మహిళా-శిశు సంక్షేమం కోసం రూ.1.19 కోట్లు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రూ.71.67 లక్షలు, గుర్తింపు పొందిన పేదవాడల అభివృద్ధికి రూ.9.55 కోట్లు కేటాయిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జీవనోపాదులు పెరగాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాదులు పెరగాల్సిన అవసరం ఉందని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. గురువారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో 2025-26 సంవత్సరంలో స్వయం సహాయక సంఘాల వార్షిక అప్పులు, జీవనోపాదుల ప్రణాళికల తయారీపై ఏపీఎంలు, సీసీలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జీవనోపాదుల పెంపునకు గ్రామస్థాయి నుంచి ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అప్పులు, జీవనోపాదులకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఇందుకుగాను ప్రతి ఐదు సంఘాల నుంచి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండి, చురుకైన 30 ఏళ్ల సభ్యురాలిని ఎంపిక చేయాలన్నారు. ఎంపిక కసరత్తులో ఏపీఎంలు, సీసీలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎంపిక చేసిన సభ్యులకు మండల స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు.

**వివరాలు సేకరించాలి**

ఎంపిక చేసిన సంఘ సభ్యురాలు తన పరిధిలోని ప్రతి ఒక్క సంఘ సభ్యురాలు వివరాలను సేకరించాలన్నారు. ఆ సభ్యురాలు ఎలాంటి రుణాలు తీసుకున్నారు.. బకాయిలు ఎంత ఉన్నాయి..చెల్లింపులు జరిగాయా లేదా, జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయా? లేదా అన్న విషయాలను సంపూర్ణంగా నిక్షిప్తం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు, డీపీఎంలు రవికుమార్, సుబ్బారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు దారుణం

**- మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్**



మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

**కాణిపాకం:** సామాజిక మాధ్యమం వేదికగా చేసుకుని ప్రశ్నించినందుకు అధ్యాపకుడు జ్యోతి కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నివాసంలో గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు పడుతున్న కష్టాలను ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న జ్యోతికుమార్ సామాజిక మాధ్యమం వేదిక చేసుకుని పంచుకున్నారన్నారు. అలా పంచుకోవడంతోపాటు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు పౌరుడిగా ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. దీని జీర్ణించుకోలేని కూటమి నేతలు కక్షపూరితంగా జ్యోతికుమార్‌పై అక్రమ కేసు పెట్టించడం దారుణమన్నారు. అధికార పార్టీ ఒత్తిడితో పోలీసులు సైతం అతనిపై సారా కేసు బనాయించడం సరికాదన్నారు. అక్రమంగా అరెస్టు చేయడంతోపాటు రోజంతా ఆ వ్యక్తిని తిప్పించుకోవడం కరెక్టు కాదన్నారు. పోలీసులు అధికారపార్టీకి తలొగ్గి ఇలా సామాన్య వ్యక్తుల జీవితాలతో ఆడుకోవడం సబబు కాదన్నారు. దీనిపై కచ్చితంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన పేర్కొన్నారు.

## తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

**చిత్తూరు కలెక్టరేట్ :** తెలుగుతనం ఉట్టి పడేలా ఈ నెల 30వ తేదీన ఉగాది వేడుకలకు ఏర్పాట్లు చేయాలని డీఆర్వో మోహన్ కుమార్ వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాస్థాయిలో ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్వావసు నామ ఉగాది వేడుకలను జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ వేడుకలకు చిత్తూరు ఆర్డీఓ, తహసీల్దార్లు, దేవాదాయశాఖ, పర్యాటక శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తెలుగు భాషకు ఉత్తమ సేవలందించిన వారికి నగదు బహుమతులు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీసుగుటూరు గంగమ్మ జాతర



గంగమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న కమిషనర్

**పుంగనూరు:** జమీందారుల కులదైవమైన శ్రీసుగుటూరు గంగమ్మ జాతర అమ్మవారి నిమజ్జనంతో ముగిసింది. గురువారం ఉదయం అమ్మవారిని నిమజ్జనం చేసి, విగ్రహాన్ని జమీందారులకు అప్పగించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని భుజస్కంధాలపై తీసుకెళ్లే నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన అర్చకులు బసవరాజస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌వీటీ.సోమశేఖర్, కిషోర్ అమ్మవారి నిమజ్జనంలో పాల్గొన్నారు. కాగా పట్టణంలో నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుండగానే మరో వైపు మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. చెత్తను ఎప్పటికప్పుడు ట్రాక్టర్లలో కంపోస్ట్ యార్డుకు తరలించి, బ్లీచింగ్, ఫినాయిల్ చల్లారు. ప్రధాన కాలువల్లో మురుగునీటిని తొలగించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించిన మున్సిపాలిటీ సిబ్బంది, పోలీసులు, గంగజాతర కమిటీ సభ్యులకు జమీందారులు కృతజ్ఞతలు తెలిపారు.



## సమాజ సేవపై మక్కువ చూపాలి



మాట్లాడుతున్న ప్రదీప్

**చిత్తూరు కలెక్టరేట్ :** యువత సమాజ సేవపై మక్కువ చూపాలని నెహ్రూ యువ కేంద్రం యువజన అధికారి ప్రదీప్ కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత రేపటి నాయకులని కొనియాడారు. సానుకూలమైనటువంటి ప్రభావం చూపడంలో తగిన నైపుణ్యాలు, జ్ఞానంతో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు దేశభవిష్యత్తు నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ అన్నది మన సమాజ అవసరాలను అర్థం చేసుకోవడం, పరిష్కరించేందుకు కలిసి పనిచేయడమేనని చెప్పారు. నేను అన్న భావన విడిచిపెట్టి సమాజానికి సేవ చేయడంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆదర్శనీయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కే మనోహర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం యువతను సమాజసేవకు సైనికులుగా తీర్చిదిద్దడంలో, సామాజిక బాధ్యత పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ జి ఉషారాణి మాట్లాడుతూ దేశానికి యువత వెన్నెముక అన్న భావనకు రూపం ఇస్తే అదే జాతీయ సేవా పథకం అని అన్నారు. ఇది కేవలం విద్యార్థులకు ఒక సర్టిఫికెట్ ఇవ్వడానికో, ఉద్యోగ అవకాశాలు ఇప్పించడానికో అని కాకుండా క్రమశిక్షణ, మంచి నడవడిక నేర్పడానికి అని చెప్పారు. ఆంగ్ల శాఖ అధ్యక్షులు డాక్టర్ తిరు కుమరన్ మాట్లాడుతూ నేటి యువతే రేపటి నాయకులని అన్నారు. వారి చేతిలోనే దేశ భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం పలు పోటీల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో అర్హులైన మైనారిటీలు పీఎం ఉపాధికల్పన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ కార్పొరేషన్ ఈడీ హరినాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి ఉపాధికల్పన పథకానికి జిల్లాలోని మైనారిటీ వర్గాలైన ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, బౌద్ధులు అర్హులన్నారు. ఈ పథకం పొందేందుకు గరిష్ట వ్యయపరిమితి తయారీ రంగంలో రూ.50 లక్షలు, సేవా రంగంలో రూ.20 లక్షలు ఉండాలన్నారు. లబ్ధిదారుల వర్గీకరణ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రేటు ప్రాజెక్టు విలువలో 15 శాతం నుంచి 35 శాతం వరకు ఇస్తుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక విధానం జిల్లా స్థాయిలో పథకం అమలు చేసే జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా ఖాదీ బోర్డు, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో సంబంధిత బ్యాంకులను సంప్రదించి స్కోరింగ్ విధానంలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు 18 ఏళ్ల పైబడి ఉండాలన్నారు. తయారీ రంగంలో రూ.10 లక్షలు పైబడిన ప్రాజెక్టులకు, సేవారంగంలో రూ .5 లక్షల పైబడిన ప్రాజెక్టుల స్థాపనకు దరఖాస్తు చేసుకునే వారు కనీసం 8 వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఈ పథకం నూతన ప్రాజెక్టులు, యూనిట్లకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఇప్పటికే మైనారిటీ అభ్యర్థులు ప్రభుత్వ పథకాల రాయితీ పొందుతున్నట్లైతే అనర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు www.kivconine.gov.in/pmefpeporta/ irp/pmefponine.jrp అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ, ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ అవసరమైన చోట, గ్రామీణ ధ్రువీకరణపత్రం, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్, విద్య, సాంకేతిక, ఈడీపీ శిక్షణ ధ్రువీకరణపత్రం ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసిన తర్వాత మైనారిటీ ఈడీ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

## క్లుప్తంగా

### 300 మామిడి చెట్లు దగ్ధం
– రూ.2 లక్షల పంట నష్టం


అగ్ని ప్రమాదంలో కాలి పోయిన మామిడి చెట్లు

రొంపిచెర్ల: గానుగచింత గ్రామ పంచాయతీలో బుధవారం రాత్రి 300 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ. 2 లక్షల పంట నష్టం వాటిల్లింది. బాధితుల కథనం మేరకు.. పెద్దమాదిగపల్లెకు చెందిన వి.రామచంద్ర నాలుగు ఎకరాల్లో సుమారు 300 మామిడి చెట్లను సాగు చేస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి మామిడి తోటకు నిప్పు పెట్టడంతో చెట్లు పూర్తిగా కాలి పోయాయి. దీంతో సుమారు రూ. 2 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతు రామచంద్ర కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు నిప్పు పెట్టారని తహసీల్దార్, రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

### హోషికియా కారు షోరూం ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవంలో షోరూం మేనేజింగ్ డైరెక్టర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఇరువారం ప్రాంతంలో గురువారం హోషికియా కారు షోరూం ప్రారంభోత్సవం చేశారు. ప్రత్యేక పూజలతో షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి ప్రారంభించారు. నూతనంగా విడుదలైన కియా సిరోస్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ అన్ని కార్ల సేల్స్, సరీ్వసులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రారంభ ధర రూ.8.99 లక్షల నుంచి ఉందన్నారు. పెట్రోల్, డీజిల్, మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్‌లలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చెరకు నిరంజన్, భారతి, హోషిమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 31లోపు దరఖాస్తు చేసుకోండి
– ఉప కార్మిక కమిషనర్ ఓంకార్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: ఈ–శ్రమ్ గుర్తింపు కార్డు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు పరిహారం కోసం ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల ఉప కార్మిక కమిషనర్ ఓంకార్‌రావు తెలిపారు. కార్మికులు ఎవరైనా 2021 ఆగస్టు 24 నుంచి 2022 మార్చి 31 మధ్య ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి వైకల్యానికి గురైనా వారి వారసులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించారన్నారు. ప్రమాద మరణానికి రూ.2 లక్షలు, పూర్తి వైకల్యానికి రూ. లక్ష మంజూరు చేస్తారన్నారు. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన వారు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు సమీపంలోని కార్మికశాఖ కార్యాలయం లేదా డీఆర్‌డీఏ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.



ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం నిల్వ

# రేషన్.. మేసేసెన్

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి అంతే లేకుండాపోయింది. పేదల కడుపు నింపాల్సిన బియ్యం పెద్దల జేబులు నింపుతోంది. కూటమి నేతలు బియ్యం దొంగలుగా మారడంతో అవినీతి, అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. ఎడాపెడా వారు మేసేస్తున్నారు. ఫలితంగా ఏప్రిల్ కోటాలో పేదలకు రేషన్ సరఫరాలో కోత పడింది. ఫలితంగా నిరుపేదలు ఆకలితో అలమటించాల్సిన దుస్థితి నెలకొంది.

- రేషన్ షాపుల్లో బియ్యం గోల్‌మాల్
- 250 షాపులకుపైగా సరుకుల్లో తేడా
- ఏప్రిల్ నెల కోటాలో వెయ్యి టన్నుల కోత
- పలు షాపులకు జీరో స్టాక్..
- మరికొన్ని షాపులకు సరుకులు అరకొర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి పెద్దలు పేదల బియ్యాన్ని చౌకగా దోచేస్తున్నారు. దీంతో ఏప్రిల్ నెల కోటాలో భారీగా కోత పడింది. ప్రభుత్వం జిల్లాకు బియ్యం కేటాయింపును కుదించింది. ఈ కారణంగా పలు షాపులకు జీరో స్టాక్, మరికొన్ని షాపులకు 10 శాతంతో సరిపుచ్చింది. కార్డుదారులు అయోమయంలో పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు డీలర్ షాపులను లాక్కునే ప్రయత్నం చేశారు. కొన్ని ఏళ్లుగా షాపుల నిర్వహిస్తున్న వారిని కూడా వదలకుండా పట్టి పీడించారు. బెదిరింపులకు గురిచేశారు. అధికారుల ద్వారా అనధికారిక కేసులు పెడతామని, షాపులు వదిలేయండంటూ బహిరంగంగానే భయపెట్టారు. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారుగా 250 పైగా షాపులను బలవంతంగా లాగేసుకున్నారు. ఆ తర్వాత మండల స్థాయి అధికారులకు జాబితా పంపి షాపుల కేటాయింపు చేయించుకున్నారు.

**కొల్లగొట్టేశారు!**

బెదిరించి, భయపెట్టి షాపులు దక్కించుకున్న కూటమి నేతలు రేషన్ షాపుల్లోనే సరుకులను కొల్లగొట్టేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని బియ్యం అక్రమంగా తరలించి, కిలో రూ. 10 నుంచి రూ. 17 వరకు విక్రయించారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇక కొత్తగా డీలర్ అవతారమెత్తిన నేతలు ఈ బియ్యాన్ని అక్రమంగా విక్రయించుకున్నారు. మూడు నెలలుగా సీబీ (క్లోసింగ్ బ్యాలెన్స్) కూడా చూపించలేదు. ఇలా టన్నుల కొద్దీ రేషన్ బియ్యం మాయమైంది. గత 9 నెలల కాలంలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలతోపాటు రవాణా అవుతున్న 80 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. అయినా పౌరసరఫరాలశాఖ అధికారులు అధికారానికి తలొగ్గి మిన్నకుండిపోయారు. దీని ప్రభావం పేదలపై పడింది. గత 9 నెలల కాలంలో కూటమి నేతలు అక్రమ బియ్యం వ్యాపారంలో పట్టుబడడం ఈ అక్రమానికి నిదర్శనమని పలువురు మండిపడుతున్నారు.

**అక్రమ బాగోతంతోనే కోత**

జిల్లాలో 1,390 రేషన్ కార్డుదారులున్నారు. ఈ షాపులకు 14 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ సరుకులు సరఫరా అవుతాయి. జిల్లావ్యాప్తంగా 5.40 లక్షల కార్డులుండగా బియ్యం ప్రతి నెలా వంద శాతం రేషన్ పంపిణీ జరిగితే 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. మిగులు సరుకులు ఆధారంగా షాపులకు సరుకులు కేటాయిస్తుంటారు. ఈ తరుణంలో 9 వేల మెట్రిక్ టన్నుల నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల వరకు బియ్యం జిల్లాకు సరఫరా అవుతుంది. ఏప్రిల్ నెలకు గాను 8 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయింపు జరిగింది. ఈ కేటాయింపుతో 6 షాపులకు జీరో స్టాక్ కేటాయింపు జరిగింది. 40 షాపులకు 10 శాతం అలాట్ అయింది. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని డీలర్లు చెబుతున్నారు. జిల్లాలోని 40 వేల కార్డులకు వచ్చే నెల సరుకులు అందడం కష్టతరంగా ఉందని శాఖ అధికారులు అంటున్నారు. ఊహించని ఈ పరిణామంతో పలువురు డీలర్లు విస్తుపోతున్నారు. ఆ అరకొర సరుకులు మాకొద్దన్ని డీలర్లు పలు చోట్ల తిరస్కరిస్తున్నారని సమాచారం. కాగా వచ్చే నెల ప్రజలకు ఎలా సమాధానం చెప్పుకోవాలో తెలియక డీలర్లు అయోమయంలో పడ్డారు.

**పౌరసరఫరాలశాఖ అధికారుల నిర్లక్ష్యమే**

జిల్లాలో కళ్ల ఎదుటే అక్రమాలు జరుగుతున్నా అధికారులు కుర్చీలకు పరిమితమయ్యారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమయ్యారు. గత కొన్ని నెలలుగా షాపుల్లోని నిల్వలను గుర్తించలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### జిల్లా సమాచారం..

| | |
|---|---|
| ఎంఎల్ఎస్ పాయింట్లు – | 14 |
| జిల్లాలో రేషన్‌షాపులు – | 1,379 |
| కార్డులు – | 5.40 లక్షలు |
| వందశాతం రేషన్ పంపిణీకి కావాల్సిన బియ్యం – | 15 వేల మెట్రిక్ టన్నులు |
| ప్రతినెలా జిల్లాకు అవసరమైన బియ్యం – | 9 వేల నుంచి 10 వేల మెట్రిక్ టన్నులు |
| చక్కెర – | 3.15 వేల న్నులు |
| ఈనెల ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం – | 8 వేల టన్నులు |
| కోత పడిన బియ్యం – | వెయ్యి టన్నులు |
| జీరో స్టాక్ షాపులు – | 6 |
| 10 శాతం కేటాయింపు జరిగిన షాపులు – | 40 |
| వచ్చే నెల సరుకులు కోత పడే కార్డులు – | సుమారు 40 వేల కార్డులు |

### ఇదిగో సాక్ష్యం...

- ఇటీవల చిత్తూరు నగరం వినాయకపురంలోని 41వ షాపుల్లో రేషన్ ఇవ్వకుండా దోచుకుంటున్నారని కార్డుదారులు ఆందోళనకు దిగారు. షాపునకు వచ్చిన రేషన్‌ను డీలర్ అక్రమంగా అమ్మేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇది గందరగోళంగా మారడంతో విచారణకు దిగిన అధికారులు బియ్యం 37 క్వింటాళ్లు, చక్కెర 28 కేజీలు తేడా ఉన్నట్లు గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ డీలర్ కూటమి నేతగా చలామణీ అవుతున్నారు. ఈ షాపునకు జీరో స్టాక్ పడిందని సమాచారం.
- చిత్తూరు నగరం మురకంబట్టులోని తిమ్మసముద్రంలోని కూటమి నేత మూస ఇంట్లో 101 క్వింటాళ్ల బియ్యం నిల్వలను పట్టుకున్నారు. ఓ ప్రైవేటు గదిలో ఉన్న బియ్యాన్ని గుర్తించిన తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ 9 నెలల కాలంలో కూటమి నేతలు చేస్తున్న అక్రమ వ్యాపారం ఈ రెండు మాత్రమే కాదు. పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇన్ని ఆధారాలున్నా.. అక్రమ వ్యవహారాన్ని వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా వ్యవహరించిన డీలర్లపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

కూటమి నేతలకు తలొగ్గి, బియ్యం అక్రమ వ్యాపారాన్ని పెంచి పోషించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత 9 నెలలుగా అక్రమాలపై ఫిర్యాదులు వస్తున్న ఆ శాఖ అధికారులు పూర్తిగా కనుమరుగయ్యారు. అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు వెళ్లడంతో రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారం బట్టబయలవుతోంది. ఇప్పుడు కూడా ఆశాఖ అధికారులు ఈ వ్యవహారాన్ని కప్పి పుచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

### రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తంతు

ఈ కోతలు చిత్తూరులోనే జరిగినట్లు భూతద్దంలో చూపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగింది. అనంతపురం, అన్నమయ్య జిల్లాలో మరింత తీవ్రంగా ఉంది. దానికి మేము ఏం చేయాలో చేస్తున్నాం. జీరో స్టాక్, తక్కువగా సరుకు వచ్చిందని ఎక్కడైనా చూపించమని చెప్పు. ఇంకా షాపులకు సరుకులే దిగలేదు. అప్పుడే ఎలా తెలిసిపోతాయి. జేసీ పిలిచి మాట్లాడారు. విషయం చెప్పాం.

– శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

### పిల్లల్లో సమగ్ర అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న వెంకటేశ్వరి

తవణంపల్లె: నవచేతన్, ఆధార్‌శిలతో పిల్లల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరి తెలిపారు. గురువారం మండలంలోని అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ, పఢాయిబీ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ, పఢాయిబీ కార్యక్రమం కింద మూడు రోజులు పాటు శిక్షణ ఇస్తామన్నారు. మూడేళ్లలోపు పిల్లలకు పోషణ, ఆరోగ్యం, మైల్డ్‌స్టోన్స్ సాధించేలా నవచేతన్ కార్యక్రమం చేపడతామన్నారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు సమగ్ర అభివృద్ధిని సాధించడానికి ఆధార్‌శిల అమలు చేస్తామన్నారు. మహిళా, శిశు సంక్షేమం మూడు రకాలు చేపడతామన్నారు. పోషణ, మిషన్‌వాత్సల్య, మిషన్ శక్తి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఐరాల సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ పిల్లల్లో సమగ్రాభివృద్ధి సాధించాలంటే కిషోర్ బాలికల స్థాయి నుంచి విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సూపర్‌వైజర్ లావణ్య, మంజుల, భారతి, వీబీసీ నజ్రీన్ పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ ఏటీసీ వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 75,354 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,510 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.54 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

## జనసేన నాయకుడిపై సారా కేసు


జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్న యుగంధరలతో నిందితుడు పరమేశ్వర్

కార్వేటినగరం:సారా స్థావరాలపై దాడులు చేసి, ఊటను ధ్వంసం చేయడంతోపాటు ఇందుకు బాధ్యుడైన జనసేన నాయకుడిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. వెదురుకుప్పం మండలంలోని చిన్ననక్కలాంపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా స్థావరాలపై గురువారం చిత్తూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్‌కుమార్, సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడుల్లో చిన్న నక్కలాంపల్లె గ్రామానికి చెందిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నీలాలయ్య కుమారుడు పరమేశ్వర్ పొలంలో సారా తయారీకి నాలుగు డ్రమ్ముల్లో సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి పరమేశ్వర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా నిందితుడు పరమేశ్వర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. డ్రమ్ములను కార్వేటినగరం సీఐ శిరీషదేవికి అప్పగించినట్లు చెప్పారు. త్వరలో పరమేశ్వర్‌ను అరెస్టు చేస్తామన్నారు. అలాగే మాంబేడు గ్రామంలో కార్వేటినగరం సీఐ శిరీషదేవి ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈదాడుల్లో అదే గ్రామానికి చెందిన ధర్మారెడ్డి వద్ద ఉన్న సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎక్కడి నుంచి తీసుకొచ్చావని అడగ్గా నక్కలాంపల్లె గ్రామంలో పరమేశ్వర్ వద్ద తెచ్చుకున్నట్లు ధర్మారెడ్డి చెప్పాడని సీఐ తెలిపారు.

**పలు గ్రామాలకు సరఫరా**

చిన్న నక్కలాంపల్లె గ్రామానికి చెందిన పరమేశ్వర్ జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇతను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్న యుగంధర్‌కు సన్నిహితుడు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సారా తయారు చేసి విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇతను తయారు చేసిన సారా పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గతంలో అనేక సార్లు పోలీసులు పట్టుకుంటే వెంటనే జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్‌తో అధికారులపై ఒత్తిడి తెచ్చి కేసులు లేకుండా తప్పించుకుంటున్నట్లు విమర్శలున్నాయి. అటవీ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమగా నెలకొల్పి నాటు సారా సామ్రాజ్యాన్ని నడుపుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

### ఏనుగుల దాడిలో దూడ మృతి
–పంటలకు నష్టం


ఏనుగుల దాడిలో మరణించిన దూడ

యాదమరి: మండలంలో ఏనుగుల ధ్వంస రచన కొనసాగుతూనే ఉంది. ఇప్పటివరకు పంటలకు నష్టం కలిగించిన ఏనుగులు తాజాగా గురువారం మండలంలోని దళవాయిపల్లెకు చెందిన రైతు మణికి చెందిన దూడను బలిగొన్నాయి. అలాగే రాజగోపాల్‌కి చెందిన కొబ్బరి, గజేంద్రకి చెందిన బోరు మోటారు, గుణశేఖర్‌కు చెందిన వరి పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ ఉన్నతాధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టపరిహారాన్ని అంచనా వేసి త్వరలోనే బాధితులకు ఇస్తామని, అలాగే ఏనుగుల కట్టడికిగాను సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటామని పశ్చిమ విభాగ ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌ఓ సంకేత్ గరుడ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎర్రచందనం కేసులో 10 మందికి జైలు


ముద్దాయిలను చిత్తూరు జిల్లా జైలు తరలిస్తున్న పోలీసులు

శ్రీరంగరాజపురం : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో పది మందికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. సీఐ కథనం మేరకు.. 2014 సంవత్సరంలో మండలంలోని ముద్దుకుప్పం గ్రామానికి చెందిన రామారావు(30), టి.సుబ్రమణ్యం(30), మునస్వామి ఉపేంద్ర (27), అరుముగం(47), శులగిళ్ల శోభన్‌బాబు, అలాగే తమిళనాడు రాష్ట్రానికి చెందిన రవి(43), విజయ్ కుమార్(32), చిన్నప్పన్(48), పురుషోత్తంరాజు (38), వెంకటేష్(40) పది మంది కలసి ఎర్రచందనం రవాణా చేస్తున్నట్లు రహస్య సమాచారం పోలీసులు అందింది. దీంతో పోలీసులు దాడులు చేసి వారిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ పుత్తూరు అసిస్టెంట్ కోర్టులో కొనసాగుతూ వచ్చింది. నిందితులపై నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని సీఐ తెలిపారు. దీంతో దోషులను తిరుపతి స్పెషల్ కోర్టులో అప్పీల్ చేసుకోవడంతో తిరుపతి కోర్టు పుత్తూరు కోర్టు విధించిన శిక్షను సమర్థించింది. దీంతో ముద్దాయిలను చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచి అప్పటి ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, చార్జిషీట్ దాఖలు చేసిన ఎస్‌ఐ అరుణ్‌కుమార్, శ్రీనివాసంతిని సీఐ హనుమంతప్ప అభినందించారు.

### రైతు ఆత్మహత్య

పుత్తూరు: పట్టణంలోని తాయిమాంబాపురం గ్రామానికి చెందిన రైతు మునస్వామిరెడ్డి(60) చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎస్‌ఐ ఓబయ్య కథనం మేరకు.. పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డు తాయి మాంబాపురం గ్రామానికి చెందిన రైతు మునస్వామిరెడ్డి ఈ నెల 23వ తేదీన పొలం వద్దకు వెళ్లి అక్కడ పురుగుల మందు తాగాడు. సమీప రైతులు గమనించి పుత్తూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంత రం తిరుపతి రుయాకు తరలించారు. గత 5 రోజులుగా మృత్యువుతో పోరాడి చివరకు గురువారం తుది శ్వాస వదిలాడు. మృతుడికి భార్య పిల్లలు ఉ న్నారు. వ్యవసాయం కోసం చేసిన అప్పుల బాధ లు భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు.



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహాత్మజ్యోతిరావు పూలే భవనాన్ని ప్రారంభిస్తున్న అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)



గత ప్రభుత్వం ప్రారంభించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన టీడీపీ నేత



మరోసారి భవన నిర్మాణం ప్రారంభానికి బీసీ సంక్షేమ శాఖ ముద్రించిన ఆహ్వానపత్రిక



# ఏమిటీ మాయ!

అభివృద్ధికి చిరునామా.. ప్రభుత్వాలు మారినా.. కాలం కరిగినా.. శాశ్వతంగా నిలిచే చిహ్నం శిలాఫలకం.. అయితే వాటినీ కాలకూటమి కాటేస్తోంది. వాటి ఆనవాళ్లు లేకుండా మాయ మంత్రం వేస్తోంది. చెల్లికి చేయాలి పెళ్లి మళ్లీ మళ్లీ అని ఓ సినిమా కవి అన్న చందంగా అభివృద్ధి పనులకూ చేయాలి ప్రారంభం మళ్లీ మళ్లీ అన్న చందంగా మారింది కూటమి నేతల తీరు.. అందుకు అధికారులూ జీహుజూర్ అంటుండడం.. జనాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. అదే జరుగుతోంది.. చిత్తూరులోని మహాత్మజ్యోతిరావు పూలే భవనం విషయంలో. ఇదంతా చూస్తున్న జనం ఏమిటీ మాయ అంటున్నారు.

- గత వైఎస్సార్ సీపీ పాలనలో పూలే భవనం ప్రారంభం
- భవన నిర్మాణ పనులకు గత ప్రభుత్వం రూ.44.3 లక్షలు ఖర్చు
- ప్రారంభ శిలాఫలకం ధ్వంసం చేసిన టీడీపీ నేత
- అదే భవనాన్ని 28న ఇన్‌చార్జ్ మంత్రి ప్రారంభిస్తారని ప్రకటన

చిత్తూరు కలెక్టరేట్: ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతూనే ఉంటాయి. అయితే ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి పనులు చిరకాలం నిలిచిపోతాయి. అయితే జిల్లా కేంద్రంలో 2023 సెప్టెంబర్ 15వ తేదీన అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆ భవనాన్ని ప్రారంభించిన భవనాన్నే ప్రస్తుత జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా మళ్లీ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల మేలు కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు.. సంక్షేమ పథకాలను అమలు చేసింది. గత ఐదేళ్లల్లో పార్టీలు, వర్గాలు, మతాలు, కులాలు ఇలాంటివేమి చూడకుండా ప్రజలకు మేలు చేసింది. అయితే ప్రస్తుత కూటమి మసిపూసి ఇదే మారేడు కాయ చందంగా ప్రజలను మాయ చేస్తోంది. ఈ మాయలను చూస్తున్న జిల్లా వాసులు చంద్రబాబునాయుడులో మార్పు ఉండదని విమర్శిస్తున్నారు.


గత ప్రభుత్వంలో అంగరంగ వైభవంగా పూర్తి చేసిన భవన నిర్మాణ పనులు

**రూ.44.3 లక్షలతో గత ప్రభుత్వం పనులు**

జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్మించిన మహాత్మ జ్యోతి రావు పూలే భవన నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.44.3 లక్షలు ఖర్చు చేసి, అధునాతన హంగులతో నిర్మించింది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా భవనాన్ని నాణ్యతతో నిర్మించింది. ఆ భవనాన్ని 2023 సెప్టెంబర్ 15వ తేదీన అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

### ప్రారంభ శిలాఫలకం ధ్వంసం

ప్రభుత్వాలు మారినా అభివృద్ధి పనుల శిలాఫలకాలు చిరస్థాయిగా ఉంటాయి. అయితే సీఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహించే చిత్తూరు జిల్లా కేంద్రంలో వింత ధోరణి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పూలే భవన నిర్మాణ పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని టీడీపీ నేత ధ్వంసం చేశారు. అర్ధరాత్రి సమయంలో ఆ భవనం వద్దకు వెళ్లి విధుల్లో ఉన్న వాచ్‌మెన్‌ను బెదిరించి మరీ శిలాఫలకం ధ్వంసం చేసేశారు. ఇలాంటి విధ్వంసాలను గతంలో ఎన్నడూ జరగలేదని బీసీ సామాజిక వర్గాలు పెదవివిరుస్తున్నాయి. శిలాఫలకాలను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమైనప్పటికీ కూటమి నేతలు అలాంటి పనులే చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయం ప్రస్తుత బీసీ సంక్షేమ శాఖ అధికారికి తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారు.

### నేడు మళ్లీ ప్రారంభమట!

గత వైఎస్సార్‌సీపీ పాలనలో పనులు పూర్తి చేసి ప్రారంభించిన మహాత్మజ్యోతిరావు పూలే భవనాన్ని మళ్లీ ఈ నెల 28వ తేదీన ప్రారంభించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు సైతం పూర్తి చేసింది. అధికారులు ఆహ్వాన పత్రికలను ముద్రించి, అందరికీ పంపిణీ చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ప్రతిష్ట.. అదనపు గదుల నిర్మాణ ప్రారంభోత్సవం అంటూ మరోసారి ప్రారంభించనున్నారు. ఈ తతంగం చూస్తున్న జిల్లా ప్రజలు కూటమి పాలనలో మాయలు తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని విరుచుకుపడుతున్నారు.

### వ్యాపారవేత్తలుగా ఎదగాలి
– సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి


మహిళా సంఘాలకు మంజూరైన రుణ మొత్తం చెక్కును చూపుతున్న నారా భువనేశ్వరి

కుప్పం: స్వయం సహాయ సంఘ మహిళలకు బ్యాంకు అందిస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకుని, మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సూచించారు. కుప్పంలో గురువారం బీఆర్‌డీఏ, మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘ మహిళలకు సేవలు అందించడానికి ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మైక్రోసెట్ శాఖను ఆమె ప్రారంభించారు. అనంతరం కృష్ణదాసనపల్లి, గుడ్లనాయనిపల్లి గ్రామాల్లో మహిళలతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. కుప్పం క్లస్టర్ పరిధిలో 160 సంఘాలకు రూ.30 కోట్లు ఇండియన్ బ్యాంకు ద్వారా మహిళా సంఘాలకు రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జోన్ ద్వారా మహిళా సంఘాలకు 330 కోట్లు ఇండియన్ బ్యాంకు ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

### కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వేసవి శిబిరంలో భాగంగా జాబ్ ఓరియెంటెడ్ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. 45 రోజుల కాలవ్యవధితో కంప్యూటర్ ఫండమెంటల్స్, ఆఫీస్ ఆటోమేషన్ (ఎంఎస్ ఆఫీస్), 2 నెలల కాలవ్యవధితో సీ, సీ++, ఆటోక్యాడ్, 3 నెలల కాలవ్యవధితో హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, మల్టీమీడియా, 6 నెలల కాలవ్యవధితో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ అడ్వాన్స్‌డ్ మల్టీమీడియా అండ్ యానిమేషన్ కోర్సుల్లో తక్కువ ఫీజుతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా కోర్సులకు కనీస విద్యార్హత 7వ తరగతి అని, వివరాలకు 99851 29995, 76718 87039 నంబర్లలో సంప్రదించాలని కోరారు.